

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 01 | నవంబర్ | 2026 | పేజీలు: 08

పేదింటి ఆత్మగౌరవం ఇల్లు

657 మందికి ఇందిరమ్మ ఇళ్లు

100 రోజుల్లో పూర్తి చేయాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మారెడ్డి

సూర్యాపేట, అక్షిత బ్యూరో : అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టాలు పొందిన ..మిగతా 2లో

అగ్రిస్టాక్‌తో అన్నదాతకు

డిజిటల్ భరోసా

రైతులకు మెరుగైన సేవలందించేందుకు పకడ్బందీ చర్యలు

డేటా సేకరణలో కచ్చితత్వం

శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, అక్షిత ప్రతినిధి : నిర్మల్ జిల్లా వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను విస్తృతం చేసి రైతులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ, రెవెన్యూ, ఐటీ తదితర అనుబంధ శాఖలు సమన్వయంతో ..మిగతా 2లో

తిరుమలగిరి బడి

చారిత్రాత్మకం

ఉద్యమ వేదిక తిరుమలగిరి బడి

క్రీడలతో మానసిక ఉల్లాసం

తిరుమలగిరిలో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ

క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

బడి అభివృద్ధికి రూ.30 లక్షలు

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యస్ జియాప్ సూర్యాపేట జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ముఖ్యఅతిథిగా విచ్చేసి, టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడి, వారికి స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. తిరుమలగిరి పాఠశాలకు ఎంతో గొప్ప చారిత్రాత్మక ..మిగతా 2లో

దేశ ఐక్యతకు బలమైన పునాది

దేశ ఐక్యతకు స్ఫూర్తి వల్లభాయ్ పటేల్

కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్, అక్షిత బ్యూరో : జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లో ఘనంగా 2కే రన్ భారతదేశ ఐక్యత, సమగ్రత, సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని, జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. వికారాబాద్ పట్టణంలో 2 కే రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ..మిగతా 2లో

నైపుణ్యంతోనే విద్యార్థుల భవిత

'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్' ను ప్రారంభం

కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్, అక్షిత న్యూస్: మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సంసిద్ధులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'ఫౌండేషన్ ..మిగతా 2లో

అగ్రిస్టాక్‌తో అన్నదాతకు డిజిటల్ భరోసా

మొదటి పేజీ తరువాయి...

పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అగ్రిస్టాక్ టాస్క్‌ఫోర్స్ కమిటీతో నిర్వహించిన తొలి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

అగ్రిస్టాక్ ద్వారా రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారం డిజిటల్ రూపంలో అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెరగడంతోపాటు అర్హులైన రైతులకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ లక్ష్య సాధనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన వివరాల సేకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయానికి సంబంధించిన గణాంకాలను కచ్చితంగా నమోదు చేయాలని, డేటా నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

శాఖల మధ్య సమన్వయం కీలకం

అగ్రిస్టాక్ అమలు విజయవంతం కావాలంటే అన్ని శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయాధికారి సుజాత, ఉద్యానవన శాఖ అధికారి రమణ, డీఆర్డీవో విజయలక్ష్మి, సీపీవో గంగారెడ్డి, డీసీఎస్‌వో రాజేందర్, డీవీఏహెచ్‌వో సురేష్, ల్యాండ్ సర్వే ఏడీ విఠల్, ఎల్డీఎం రామ్‌గోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు బలమైన పునాది

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ, జాతీయ ఐక్యతా దినోత్సవం దేశ సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ భావనతో ముందుకు సాగాలని, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై ఐక్యతతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.

ఈ 2కే రన్ ద్వారా దేశ ఐక్యత, సోదరభావం, జాతీయ సమైక్యత ప్రాముఖ్యతను ప్రజలకు చాటిచెప్పారు. దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.యెన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ రన్‌లో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఏఆర్ డీఎస్పీ వీరేష్ ,వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, యువతులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి బడి చారిత్రాత్మకం

మొదటి పేజీ తరువాయి...

నేపథ్యం ఉందని, ఇక్కడి నుండి చదువుకుని ఎంతో మంది మహనీయులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో మంది ఉద్యమకారులు ఈ వేదిక పై నుంచే ప్రసంగించారని, నాడు ఆ ఉద్యమకారులతో పాటు తాను కూడా ఈ వేదికపై పాల్గొన్నానని ఆయన భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. నాడు ఉద్యమ వేదికైన ఇదే పాఠశాల వేదికపై నేడు శాసనసభ్యునిగా నిలబడి మాట్లాడటం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని ఇస్తోందని హర్షం వ్యక్తం చేశారు.రాబోయే కాలంలో తిరుమలగిరి పాఠశాలను జిల్లాలోనే నెంబర్ వన్ పాఠశాలగా తీర్చిదిద్దే బాధ్యతను తాను పూర్తిగా స్వీకరిస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాల అభివృద్ధికి ఇంకా ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా, మరిన్ని నిధులు తీసుకురావడానికైనా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆయన మాట ఇచ్చారు.

ఈ చారిత్రాత్మక పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిగా, జిల్లా కలెక్టర్ వారి ద్వారా రూ. 30 లక్షల నిధులను మరమ్మతుల కోసం మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ నిధులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మందుల సామేలు చొరవతో కలెక్టర్ వారి నుండి రూ. 30 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో ప్రస్తుతం పాఠశాల మరమ్మతు పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పాఠశాల రూపురేఖలు మారుస్తున్న ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్ సంకపల్లి రఘునందన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోవిందమ్మ రవీందర్, మండల విద్యాశాఖ అధికారి శాంతయ్య, మున్సిపాలిటీ కమిషనర్ వెంకన్న, మండల తహసీల్దార్ అబ్దుల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరి జనార్ధన్ పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన అంబేద్కర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు బత్తుల శ్రీనివాస్, యాకూబ్ నాయక్, కందుకూరి గీత బాబు, ఫతేపురం త్రిశూల్, వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, పీఈటీలు, పార్టీ ప్రధాన నాయకులు పేరాల వీరేష్, కుర్ర శ్రీనివాస్, దుప్పల్లి అబ్బాస్, కుంభం సతీష్ గౌడ్ , ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదింటి ఆత్మగౌరవం ఇల్లు

మొదటి పేజీ తరువాయి...

లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి,100 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. బేస్‌మెంట్,లింటెల్,రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రతి దశలో నిర్మాణ ఫోటోలను అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు.

పేదల సొంతింటి కలకు సాకారం

ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మీ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీకి 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ, పలువురు ప్రజాప్రతినిధుల సహకారంతో పథకం అమలవుతోందని చెప్పారు.గతంలో మాజీ మంత్రి దివంగత నేత దామోదర్ రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న వారు ఇప్పటికీ సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు.ప్రస్తుతం ఇళ్లు మంజూరైన వారు కూడా నాణ్యమైన ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఇళ్ల నిర్మాణాలతో మేస్త్రీలు,కూలీలు, పెయింటర్లు,నిర్మాణ సామగ్రి వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని,స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3,100 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని,అర్హులకు త్వరలో పెన్షన్లు అందిస్తామని వెల్లడించారు.అర్హులైన పేదలు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ రెడ్డి,ఎఎంసీ చైర్మన్ వేణారెడ్డి, పిడి హౌసింగ్ జబ్బర్ మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,ఎఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనువాస్,ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న,పలువురు కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విద్యార్థుల భవిత

మొదటి పేజీ తరువాయి...

ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేవలం విద్యాపరమైన మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో యంగ్ ఒరేటర్స్ క్లబ్ , థింక్ అండ్ మేక్ , స్వతః, ఫ్యూచర్ డాట్స్ వంటి నాలుగు ప్రధాన రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. యంగ్ ఒరేటర్స్ క్లబ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల, మౌఖిక సంభాషణ నైపుణ్యాలు, వేదికపై ధైర్యంగా ప్రసంగించడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ కార్యక్రమానికి కీర్తన వేపా ప్రతినిధిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, సామాజిక మరియు ఉద్యోగ రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్యాపరమైన మార్కులు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తుకు సరిపోవని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి జీవిత నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు.

కార్యక్రమంలో ఏ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, డిఎస్ఓ షంషీర్, జిసిడిఓ అస్రా ఖాద్రి, ఎం.ఈ.ఓ ఉషారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కెజిబివిల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ భూముల వివరాలు భూ భారతి రికార్డుల్లో నమోదు చేయాలి

నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన

కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, ప్రధాన కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చట్టం ద్వారా రైతులు, ప్రజల నుంచి సేకరించిన భూముల వివరాలను భూ భారతి పోర్టల్‌తో పాటు రెవెన్యూ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భూసేకరణ ద్వారా నీటిపారుదల శాఖకు బదిలీ అయిన భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, భూసేకరణ ప్రత్యేక అధికారి అరుణ రెడ్డితో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలో నూతన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రధాన కాలువల నిర్మాణాలకు అవసరమైన భూములను భూసేకరణ చట్టం ప్రకారం రైతులు, ప్రజల నుంచి సేకరించిన అనంతరం ఆయా భూముల వివరాలను తప్పనిసరిగా భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత మండలాల తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని 75 గ్రామాల పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు 15 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో రైతుల నుంచి సేకరించి నీటిపారుదల శాఖకు బదిలీ చేసిన భూములను రీ-సర్వేలో నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూములుగా గుర్తించి, భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.

ఈ ప్రక్రియను నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవతో వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో ఇంకా కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు అమర్ సింగ్, లింగాల్, కలెక్టరేట్ విభాగపు సూపరింటెండెంట్ నారాయణ,ఏఈలు ఇల్లు డి ఇల్లు తదితరులు పాల్గొన్నారు

సిఐ సతీష్ రెడ్డిని సన్మానించిన మున్సిపల్ కౌన్సిలర్లు

చౌటుప్పల్/ అక్షిత న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణ నూతన సీఐ గా బాధ్యతలు స్వీకరించిన దేవిరెడ్డి సతీష్ రెడ్డి ని శనివారం బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో 4వ వార్డు కౌన్సిలర్ ఊదరి యాదయ్య, 15 వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిరా రాజారత్నం లు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులకు పదోన్నతి పొందాలని ఆకాంక్షించారు.

అర్హులైన ప్రతి ఒక్కరు పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

ఐదవ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొండూరూ ధర్మేందర్ గౌడ్

చౌటుప్పల్ /అక్షిత న్యూస్: వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభం ప్రారంభమైందని అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఐదో వార్డు ఇన్చార్జి కొండూరు ధర్మేందర్ గౌడ్ తెలిపారు. చౌటుప్పల్ మండలంలో నివసిస్తున్న అర్హత కలిగిన పట్ట బద్రులు అందరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని ధర్మేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. దరఖాస్తుదారులు 2023 నవంబర్ 1 నాటికి కనీసం మూడు సంవత్సరాల ముందే డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, దరఖాస్తులను అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో సమర్పించవచ్చు అని తెలిపారు.నేరుగా దరఖాస్తు చేసుకున్నవారు నింపిన పారం 18 ను సంబంధిత కార్యాలయాలలో నేరుగా సమర్పించవచ్చు నన్నారు.నమోదు ప్రక్రియను పూర్తి చేయడానికి చివరి తేదీ 6 నవంబర్ 2026 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హత గల పట్టబద్రులందరూ గడువు ముగియకముందే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రతి గ్రామంలోని కాంగ్రెస్ శ్రేణులు బాధ్యత తీసుకొని అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు అయ్యేలా చూడాలని ధర్మేందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షిత బ్యూరో, మంచిర్యాల : దేశంలోని ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యత దినోత్సవం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, (రెవెన్యూ)

వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో హాజరై వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

అక్షిత న్యూస్ మునగాల: మునగాల మండల కేంద్రంలోని రచ్చబండ దగ్గర మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటయ్య మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ కావడం దేశానికి ఆదర్శం. పేద ప్రజలందరికీ ఇందిరమ్మ పాలన అందించిందని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నల్లపాటి శ్రీనివాస్ ,ఉప్పుల జానకి రెడ్డి ,మండల పార్టీ సీనియర్ నాయకులు పోటు అశోక్ కుమార్, ఉప సర్పంచ్ వెంకట్, శాఖ అధ్యక్షుడు ఈదారావు ,మండల పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్, గండు అంజయ్య, వార్డ్ మెంబర్ సుదీర్ ,చిన్న, మల్సూరు వెంకయ్య ,తదితరులు పాల్గొన్నారు

సర్దార్ వల్లాభాయ్ పటేల్ సేవలు దేశానికి గర్వకారణం

వరంగల్ సీపీ ఎన్.శ్వేత

వరంగల్, అక్షిత బ్యూరో: సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివాస్) సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆయన చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సర్దార్ వల్లాభాయ్ పటేల్ దేశ సమగ్రత, ఐక్యత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన దేశానికి అందించిన సేవలు ప్రతి భారతీయుడికీ గర్వకారణమని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి, దేశ ఐక్యతకు పునాది వేసిన ఉక్కు మనిషి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ మధుసూదన్, జానీ నరసింహులు, ఎ అర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, ఏఆర్ విభాగానికి చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోమటికుంట ఎక్స్ రోడ్ దగ్గర వాహనాల తనిఖీ

పిల్లలు పాఠశాలలో ఉండాలి
పత్తి చేలకు వెళ్ళ రాదు

10మంది విద్యార్థుల పాఠశాలకు తరలింపు

పిల్లలను పత్తి చేలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

లింగాల ఎస్సై చంద్రకాంత్

నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: పిల్లలను పత్తి చేలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తానని లింగాల ఎస్సై చంద్రకాంత్ హెచ్చరించారు. శనివారం లింగాల మండల పరిధిలోని బాకారం , కోమటికుంట ఎక్స్ రోడ్డు దగ్గర పత్తి తీసేందుకు కొల్లాపూర్ ,నార్లాపూర్, జీలుగుపల్లి, కొత్తకుంటపల్లి, సాతాపూర్ ,అంబటిపల్లి, కోమటికుంట, తదితర ప్రాంతాల నుండి పిల్లలను తరలిస్తున్న వాహనాలను తనిఖీలు నిర్వహించి అందులో వెళ్తున్న10 మంది పిల్లల విముక్తి కల్పించి వారి పాఠశాలలకు పంపించడం జరిగింది. ఇకనుంచి పిల్లలను పత్తి చేలకు తరలించరాదని వాహనం డ్రైవర్లకు హెచ్చరించారు. పిల్లలు ఉండాల్సింది పాఠశాలలో. పత్తి చేలలో కాదు. వారి యొక్క బంగారు భవిష్యత్తు పాఠశాలలో ఉండి విద్యను అభ్యసించాలి. పిల్లలపై పని భారం వద్దు , జిల్లా బాలల సంరక్షణ విభాగం లలిత, సృజన, లింగాల ఎస్సై చంద్రకాంత్, కోనేరు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సలీం ,చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ ప్రమీల,విద్యాశాఖ ఎంఈఓ బషీర్ అహమద్, పోలీస్ శాఖ కానిస్టేబుళ్లు శివశంకర్, కుద్దూస్, మరియు ,కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కీరు వంశీదర్ రెడ్డిని సన్మానించిన దేప శ్యాంసుందర్ ముదిరాజ్

చౌటుప్పల్/అక్షిత న్యూస్: చౌటుప్పల్ మండలం,దండు మల్కాపూర్ గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పక్కీరు వంశీదర్ రెడ్డిని శనివారం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సుక్క రవీందర్, ఉప సర్పంచ్ మీసాల నర్సింహ్మా, వార్డు మెంబర్లు ఈద్దుల ఇంద్రసేన యాదవ్, అత్తపురం సంతోష అంజిరెడ్డి,జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుర్ర శివకుమార్ గౌడ్,యువజన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పక్కీరు వంశీదర్ రెడ్డి, దేవాలయం డైరెక్టర్లు బోంతల యువరాజు, దౌడి లింగస్వామి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దౌడి వేంకటేష్, గాలబ్ ఖాన్,బాబా చేపురి మహేష్,మల్కాజిగిరి నర్సింహ్మా,సుంకరి రమేష్,బుర్ర విజయ్ కుమార్ గౌడ్,సిల్వేరు బాలయ్య,బద్దుల నర్సింహ్మా,దౌడి సురేందర్ లు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

నవంబర్ 2న ఎండిన వరిపంటలను పరిశీలించనున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

రైతులలో ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యంగా సాగనున్న పర్యటన

అల్వాలలో సభాస్థలిని పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి అక్షిత ప్రతినిధి : అన్నదాతలకు అండగా బిఆరెస్ పార్టీ ఉంటుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో జరిగే అన్నదాతలకు అండగా వారిలో మనో నిబ్బరాన్ని, ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యంగా జరగనున్న బహిరంగ సభకు మాజీ మంత్రి హరీష్ రావు 2 వ తేదీన వస్తున్నా సందర్భంగా అట్టి స్థలాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హరీష్ రావు సభ జరిగే సభాస్థలిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరిశీలించి చేయనున్న ఏర్పాట్ల గూర్చి బి.ఆర్.ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని వేలాదిగా పాల్గొనే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ముందుచూపు,వ్యూహం లేకపోవడం వల్ల నీటి లభ్యత ఉన్నా సరియైన సమయంలో అందించకపోవడం అదేవిధంగా కరెంట్ కోతలతో వందలాది ఎకరాలలో వానాకాలం వరి పంటలు ఎండిపోయి రైతులు హరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్ రావు స్వయంగా ఎండిన ప్రతి ఎకరాన్ని పరిశీలించి రైతులను కలుసుకొని వారి సాధకభాధలు తెలుసుకుంటారని అనంతరం రైతులకు సత్వరమే అందాల్సిన సాయం గూర్చి ప్రభుత్వాన్ని నిలదీస్తారని అన్నారు. స్వచ్ఛందంగా రైతులు తరలివచ్చి నష్టపోయిన అన్నదాతలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి,మాజీ జెడ్.పి.టి.సి రఘుపతి రెడ్డి,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, అల్వాల్ సర్పంచ్ రాజ మహేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్ నాయకులు అల్వాల.వెంకట్ రెడ్డి, సయ్యద్.జమీల్,సేనాపతి, బాల్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి, గౌడ్ నాయక్,చిట్యాల. రాము తదితరులు ఉన్నారు.

నెక్కొండలో పిడుగుపాటు.. తప్పిన ప్రాణాపాయం

పలు ఇళ్లలో విద్యుదుపకరణాలు దగ్ధం

బాధితులకు సర్పంచ్ హరిప్రసాద్ పరామర్శ

నర్సంపేట అక్షిత ప్రతినిధి : నెక్కొంద పట్టణంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని 11వ వార్డులో నివాసం ఉంటున్న వద్దే విజేందర్ ఇంటిపై శుక్రవారం రాత్రి పిడుగు పడింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం జరగనప్పటికీ.. ఇంటి పైకప్పు పెచ్చులు ఊడిపోయి, గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. భారీ శబ్దంతో పిడుగు పడటంతో భయాందోళనలకు గురైన స్థానికులు ఇళ్లలోంచి ఆరుబయటకు పరుగులు తీశారు.

పిడుగుపాటు తీవ్రతకు చుట్టుపక్కల ఇళ్లలో విద్యుదుపకరణాలు కాలిపోయాయి. విజేందర్ ఇంట్లో ఫ్యాన్లు కాలిపోగా.. కె.భిక్షపతి ఇంట్లో ఫ్యాన్లు, మానిటర్, సీసీ కెమెరాలు, వి.రాజు ఇంట్లో టీవీ, వి.రవి ఇంట్లో ఫ్యాన్లు, ఫ్రిజ్, జి.రాజు ఇంట్లో టీవీ, ఫ్రిజ్ తదితర వస్తువులు పూర్తిగా పాడయ్యాయి.

బాధితులకు ప్రభుత్వ సాయం అందించాలి

పిడుగుపాటు ఘటన గురించి తెలుసుకున్న నెక్కొండ సర్పంచ్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని, ఆస్తి నష్టం జరిగిన కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆయన తహసీల్దార్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. దెబ్బతిన్న ఇల్లు, కాలిపోయిన వస్తువులకు సంబంధించి బాధితులకు ప్రభుత్వపరంగా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి భిక్షపతి, డీసీసీ సభ్యులు నేతుల సారంగపాణి యాదవ్, మార్కెట్ డైరెక్టర్ బొమ్మెరబోయిన రమేష్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ కదురు సాంబయ్య గౌడ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్, వార్డు సభ్యులు దేవనబోయిన విజేందర్, భూక్య రవి, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఈదునూరి ప్రభాకర్, పొట్లపెల్లి వీరస్వామి, మూసిన సారయ్య, పోరండ్ల శ్రీనివాస్, చల్లా రాము తదితరులు ఉన్నారు.

రెవిన్యూ భూమిని ఫారెస్ట్‌కు ఇవ్వొద్దు

అదే భూమిని భూములు కోల్పోయిన బుద్దారం రైతులకు ఇవ్వండి

విలేకరుల సమావేశంలో బిఆరెస్ నాయకులు

వనపర్తి అక్షిత ప్రతినిధి : రెవిన్యూ భూమిని ఫారెస్ట్ కు ఇవ్వొద్దని అవసరం అనుకుంటే అదే భూమిని భూములు కోల్పోయిన బుద్దారం రైతులకు ఇవ్వలాని గోపాల్పేట మండలం మాజీ రైతుబంధు కోఆర్డినేటర్ తిరుపతి యాదవ్, బుద్ధారం సర్పంచ్ శేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా గోపాల్ పేట్ మండల నాయకులు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంతోషం వారు మాట్లాడుతూ గోపాల్పేట, బుద్ధారం, ఏదుల, చెన్నారం, చీర్కపల్లి తల్పునూరు గ్రామాల పరిధిలోని దాదాపు 823 ఎకరాల భూమిని రెవెన్యూ భూమి నుండి ఫారెస్ట్ భూమిగా ట్రాన్స్ఫర్ చేసి,ఉమ్మడి గోపాల్పేట రైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. అలాగే వారు నిజంగా ఈ భూమిని ఇవ్వలనుకుంటే ఫారెస్టు కాకుండా బుద్ధారం గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులకు ఒక ఎకరాకు రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బుద్ధారం గ్రామ రైతులకు వ్యవసాయం చేసుకోవడం తెలుసు తప్ప, డబ్బులు తీసుకొని ఏం చేయాలో వారికి తెలియదని వారికి తెలిసిందల్లా వ్యవసాయం చేయడమే అని అన్నారు. మన ప్రాంతంలో ఉన్న రెవెన్యూ భూమిని ఇదే ప్రాంతంలో భూమి కోల్పోతున్న బుద్ధారం రైతులకు ఇవ్వాలని కోరారు. లేకపోతే యధావిధిగా ఆ భూములను అలాగే ఉంచాలని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. లేదని ప్రభుత్వం మొండి వైఖరితో వెళితే బి ఆర్ ఎస్ పార్టీ తరఫున ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాకలి పల్లి సర్పంచ్ శేషిరెడ్డి, రేవల్లి మాజీ సర్పంచ్ శివరాంరెడ్డి, చెన్నారం మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్,గొపాల్ పేట్ మాజీ వైస్ యంపిపి శేఖర్,గోల్లపల్లి మాజీ సర్పంచ్ సునీల్ కుమార్,బిఆర్ఎస్ మైనారిటీ నాయకులు మహ్మద్,ఎదుల బిఆర్ఎస్ నాయకులు కృపాకర్ రెడ్డి, చీర్కపల్లి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన బీసీ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

చౌటుప్పల్ /అక్షిత న్యూస్: చౌటుప్పల్ మండల కేంద్రంలో మంజూరైన బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండల కేంద్రంలో బీసీ విద్యార్థుల కోసం మంజూరైన హాస్టల్ ప్రారంభానికి నోచుకోకుండా మూడు నెలలు గడుస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ హాస్టల్ మంజూరు చేస్తూ సాంక్షన్ లెటర్ విడుదల చేసి, విద్యార్థుల వివరాల వెరిఫికేషన్ అనంతరం నెల రోజుల్లోనే హాస్టల్ ప్రారంభిస్తామని తెలిపినప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కరోనా సమయంలో మూతపడిన హాస్టల్‌కు ఇప్పటికీ తాళాలు అలాగే ఉండటం బాధాకరమన్నారు. హాస్టల్ మంజూరు చేసినట్లు కాగితాలపై చూపించడం కాకుండా, విద్యార్థులకు వసతి కల్పించి ఆచరణలో చూపించాలని అధికారులను డిమాండ్ చేశారు. మంజూరు చేసిన హాస్టల్‌ను ప్రారంభించడంలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతుందో జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. చౌటుప్పల్ మండలం ఏడు మండలాలకు కేంద్రంగా ఉన్న ప్రాంతమని, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజూ అనేకమంది పేద విద్యార్థులు చదువుల కోసం మండల కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి ప్రతిరోజూ రాకపోకలు సాగించడానికి విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థిక పరిస్థితులు బాగాలేని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రయాణ ఖర్చులను భరించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ విద్యార్థుల వసతి గృహం ప్రారంభమైతే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, విద్యార్థులు మండల కేంద్రంలోనే ఉంటూ తమ చదువులను కొనసాగించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. బీసీ హాస్టల్ ప్రారంభం కోసం జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం హాస్టల్‌ను మంజూరు చేసి మూడు నెలలు గడుస్తున్నా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించకపోవడం ప్రభుత్వ పరిపాలనా తీరును, అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మంజూరైన హాస్టళ్లను సైతం ప్రారంభించలేని పరిస్థితి నెలకొనడం విచారకరం. విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించకుండా వారి భవిష్యత్తు ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి బీసీ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించి, అవసరమైన నిధులు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను సమీకరించి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బండారీ విక్రమ్, తిరిగి వరుణ్ తేజ్ సుర్వి అరవింద్, నాయకులు శివ, వంశీ, నితిన్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఉరకలెత్తిన ఏక్తా రన్

ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్‌కు ఘన నివాళి: సిపి శ్వేత

వరంగల్, అక్షిత బ్యూరో : సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివాస్) సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, ఏజే పెడల్స్ సహకారంతో శనివారం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి నిర్వహించిన ఏక్తారన్ ఉత్సాహభరితంగా సాగింది.

ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ పాల్గొని పరుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, వారితో పాటు పరుగెత్తి వారిని ప్రోత్సహించారు.

జాతీయ ఐక్యత, సమైక్యతా స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఏక్తా రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, వాకర్స్, పోలీసు అధికారులు, సిబ్బంది. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమైన ఏక్తారన్(5/10 కి.మీ) వరంగల్‌లోని

గోపాలస్వామి ఆలయం వరకు కొనసాగి, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడంతో ముగిసింది. ట్రైసిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఏజే పెడల్స్ ప్రతినిధి బృందం పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన, ఏక్తా రన్ జాతీయ ఐక్యత, సమగ్రత పట్ల ప్రజల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దృఢత్వంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లాభాయ్ పటేల్ చేసిన అపారమైన సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం పరుగు పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రతి విభాగంలోని ముగ్గురు విజేతలను ఎంపిక చేసి, పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని, ఐక్యత, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ విభాగానికి చెందిన అడిషనల్ డీసీపీలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఇందిరగాంధీ వర్ధంతి వేడుకలు

ఖమ్మం /అక్షిత బ్యూరో : మాజీ ప్రధాని ఉక్కు మహిళా ఇందిరగాంధీ వర్ధంతి వేడుకలు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ కార్యాలయం లో ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను కొనియడినారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు జిల్లా అధికార ప్రతినిధి బచ్చలికూరి నాగరాజు మండల నాయకులు మామిడి వెంకన్న రాయపూడి నవీన్ నెల్లూరి భద్రయ్య శాఖమురి రమేష్ సర్పంచ్ లు తేజవత్ శివాజీ కుక్కల నరేష్ బోయిన వేణు కొలికపొంగు సీతారాములు అనుబంధ సంఘాల చైర్మన్ లు బీసీ సెల్ గుడిబోయిన వెంకటేశ్వర్లు మైనార్టీ సెల్ షేక్ ఖాజా సీనియర్ నాయకులు బోయపాటి రాంబాబు చెరుకు రంగయ్య యడవల్లి సైదులు పసుపులేటి ఉపేందర్ షేక్ మస్తాన్ మక్తల రామకృష్ణ వార్డు సభ్యులు కోడిరెక్కల వినోద్ కూరాకుల నాగేశ్వర్ రావు తోట వాసు సామల కోటేశ్వరరావు కాంగ్రెస్ నాయకులు కన్నారెడ్డి అంజయ్య రాంబాబు చిట్ల సైదారెడ్డి పొన్నగాని రాంభాస్కర్ మండవ మురళీ అఖిలేష్ తదితరులు పాల్గొని ఇందిరా గాంధీ కి ఘనంగా నివాళులు అర్పించారు.

ఘనంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు

అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: భారతదేశ ఉక్కు మనిషి, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అన్ని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి, దేశ ఐక్యతకు, సమగ్రతకు బలమైన పునాది వేసిన మహనీయుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి, చూపిన దూరదృష్టి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అధికారులతో, సిబ్బందితో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శీలం నర్సింహారావు పార్థీవదేహానికి ఘన నివాళులు

ఖమ్మం /అక్షిత బ్యూరో : నేలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి భర్త శీలం నర్సింహారావు (83) ఆరోగ్యం తో మృతి చెందారు.అయన పార్థీవదేహానికి నివాళులర్పించి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి. సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య పలు పార్టీల నాయకులు అయన పార్థువ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు.

విద్యార్థులు చట్టాలపై, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత

వలిగొండ/ అక్షిత న్యూస్: వలిగొండ మండల కేంద్రంలోని మాంటిస్సోరి హైస్కూల్లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో "సురక్ష బచ్పన్ అభియాన్ బాలల హక్కులు, పోక్సో చట్టం"పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్నపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సదస్సులో భాగంగా బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 112, న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అడ్వొకేట్ కొండూరు బాలరాజు, ప్రిన్సిపాల్ థామస్ అబ్రహం, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, అడ్వొకేట్లు కునూరు శ్రీనివాస్, సోమ సతీష్ రెడ్డి, ప్యానెల్ అడ్వొకేట్లు కనుగంటి శ్రీశైలం, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కురిమేటి యాదయ్య పాల్గొన్నారు.

చేర్యాల మున్సిపల్ వార్డు కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

చేర్యాల అక్షిత ప్రతినిధి: జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పిలుపు మేరకు, శనివారం చేర్యాల పట్టణంలో 5, 6 వార్డు కమిటీలను పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. 5వ వార్డ్ అధ్యక్షునిగా బస్వరాజు యాదగిరి, 6వ వార్డు అధ్యక్షునిగా బుట్టి బిక్షపతి లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుర్మ ఆగంరెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మెన్ ఆడెపు చంద్రయ్య, చేర్యాల మండల అధ్యక్షులు మంజె మల్లేశం, కౌన్సిలర్లు పోతుగంటి ప్రసాద్, వెలుగల దుర్గయ్య, ఎండీ షరీఫా ఖాజా, వి ఎంసి డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య, మాజీ కౌన్సిల్లరు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, ముస్త్యాల యాదగిరి, పచ్చిమడ్ల సతీష్, నాయకులు అంబాల నాగేశ్వర్ గౌడ్, చింతల మల్లేశం, కాటం శ్రీనివాస్, అంబాల రాము, బుట్టి యాదగిరి, బుడిగె సతీష్, మల్లిగారి తుమ్మలపల్లి సంతోష్, మల్లిగారి నర్సింలు, ఎండీ జహీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు సురక్షిత్ బచ్పన్ అభియాన్ ద్వారా న్యాయ చైతన్యం..

1098కు కాల్ చేసి ఆపదలో ఉన్నప్పుడు సహాయం పొంద వచ్చు..

తాండూరు అక్షిత ప్రతినిధి: తాండూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తాండూరు పట్టణం లోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి తాండూరు జూనియర్ అడిషనల్ సివిల్ జడ్జి ఏ. ప్రణయ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, వారి రక్షణ, విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొం దించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.

ఈ సందర్భంగా జడ్జి ఏ. ప్రణయ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సూచించారు. విద్యార్థి దశ అనేది భవి ష్యత్తుకు పునాది అని, ఈ దశలోనే మంచి అలవాట్లతో పాటు సమాజంలో తమకు ఉన్న హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవాలని, అన్నారు. ముఖ్యంగా

విద్యార్థులు ఎలాంటి ఆపదలో ఉన్నా, వేధింపులకు గురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బాలల సహాయ వాణి 1098కు ఫోన్ చేసి అవసరమైన సహాయం పొందవచ్చని వివరించారు.

విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య ఉన్న తేడాలను వివరించారు. తమ శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హక్కులను గుర్తించాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించి నప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని, సూచించారు. ఎలాంటి వేధింపు లనైనా మౌనంగా భరించకుండా ధైర్యంగా ముందుకు వచ్చి సహాయం కోరాలని తెలిపారు.

అలాగే బాలల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, విద్యా హక్కు చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని, బాల్య వివాహాలు బాలల భవి ష్యత్తుకు ఆటంకంగా మారు తాయని వివరించారు. ప్రతి బాలుడు, బాలికకు విద్యను పొందే హక్కు ఉందని, విద్యకు దూరం కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహం అందించాలని, సూచించారు.

బాలల హక్కులను కాపాడ టంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని, విద్యార్థులు తమ హక్కుల గురించి తెలుసు కోవడంతో పాటు ఇతరుల హక్కులను కూడా గౌర వించాలని, తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల అన్యాయాలను గుర్తించి, వాటిని ఎదుర్కొనే ధైర్యం పెరుగుతుందని, పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టాల పట్ల చైతన్యం పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగ పడతాయని, అన్నారు.

ఈ కార్యక్రమంలో తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాశం రవికుమార్, ప్యానల్ న్యాయవాదులు జిలాని, ఆంజనేయులు, అరుణ, పరమేశ్వరి, దేవ్ రాజ్, రమేష్, సూపరింటెండెంట్ డి. అర్చన, కోర్టు సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

దేశ సమగ్రత, ఐక్యతకు ఇద్దరు మహనీయుల సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

కాజిపేట్, అక్షిత ప్రతినిధి : భారత మాజీ ప్రధాని, భారత ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఇద్దరు మహనీయులను ఒకే రోజు స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన చూపిన దృఢ సంకల్పం, నాయకత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు.

అదేవిధంగా ఇందిరా గాంధీ దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలు వంటి కీలక నిర్ణయాలతో సామాజిక, ఆర్థిక రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ సేవలు, త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్య కాటికి భర్త జైలుకా ?

షాద్‌నగర్ మాత శిశు మరణంలో బిగ్ ట్విస్ట్

ఆసుపత్రి నిర్లక్ష్యం పక్కకు.. భర్త రమేష్ పోలీస్ కస్టడీకి!

న్యాయం అడగడానికి వెళ్తే భర్తపైనే పాత కేసుల పేరిట వేధింపులా? మండిపడుతున్న కుటుంబ సభ్యులు

డాక్టర్ల నిర్లక్ష్యాన్ని తొక్కిపెట్టే కుట్ర.. శవాన్ని తీసుకొచ్చినా అప్పగించని వైనం

పోలీస్ స్టేషన్ ఎదుట రమేష్ సోదరుడి సంచలన వ్యాఖ్యలు: అసలు ఏం జరుగుతోంది?

షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు గర్భిణి రాధా, ఆమె కడుపులోని శిశువు బలైన ఘటన రోజుకో మలుపు తిరుగుతూ పెను దుమారం రేపుతోంది. భార్య, పుట్టబోయే బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్త మల్లని రమేష్ కుమార్‌కు న్యాయం చేయాల్సింది పోయి, పోలీసులు ఆయన్నే అదుపులోకి తీసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వైద్యుల నిర్లక్ష్యాన్ని పక్కకు నెట్టి, పాత గొడవలను తెరపైకి తెచ్చి రమేష్‌పై అక్రమ కేసులు బనాయించే కుట్ర జరుగుతోందని బాధితుడి సోదరుడు పోలీస్ స్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద రమేష్ సోదరుడు తెలిపిన వివరాలు:

మధ్యాహ్నం వరకు అంతా సజావుగానే ఉంది తన పినతండ్రి కొడుకైన రమేష్ భార్య రాధాను డెలివరీ నిమిత్తం ఉదయం 11 గంటల సమయంలో షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో 'డెలివరీ మంచిగానే అవుతుంది, సాధారణ ప్రసవమే' అని వైద్యులు భరోసా ఇచ్చారని చెప్పారు.

సాయంత్రానికి శవమైంది.. మెటర్నిటీ హాస్పిటల్ లో చేర్చుకోలేదు:

సాయంత్రం 4 నుంచి 5 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా తీవ్రమైన ఫిట్స్ వచ్చాయని, పల్స్ పడిపోయిందని చెబుతూ రాధా అక్కడే చనిపోయిందని పేర్కొన్నారు. అయితే కడుపులోని బిడ్డనైనా కాపాడవచ్చని చెప్పి, ఆసుపత్రి సిబ్బందే అంబులెన్స్ మాట్లాడి గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ హైదరాబాద్ ఆసుపత్రికి పంపించారని తెలిపారు. తీరా మెటర్నిటీ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె అప్పటికే చనిపోయిందని అక్కడి వైద్యులు స్పష్టం చేస్తూ అడ్మిట్ చేసుకోవడానికి నిరాకరించారని చెప్పారు.

షాద్‌నగర్‌కు శవాన్ని తీసుకొచ్చినా లోపలికి రానివ్వలేదు:

హైదరాబాద్ మెటర్నిటీ హాస్పిటల్, హాస్పిటల్, నుంచి తిరిగి మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లోనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తే, కనీసం మార్చురీలోకి కూడా తీసుకెళ్లనీయకుండా బయటే ఉంచేశారని ఆరోపించారు. ఆసుపత్రి సిబ్బంది వైఖరిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగిందని తెలిపారు.

భర్త రమేష్‌ను అదుపులోకి తీసుకోవడం వెనుక కుట్ర:

ఆసుపత్రి వద్ద వాగ్వాదం జరుగుతున్న సమయంలో రమేష్‌పై దాడి జరుగుతుందన్న సాకుతో పోలీసులు ఆయన్ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని తొలుత చెప్పారన్నారు. తీరా చూస్తే, అత్తగారి కుటుంబంతో గతంలో జరిగిన చిన్నపాటి కుటుంబ మనస్పర్థలను (ఇదివరకే పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదిరి పరిష్కారమైన పాత విషయాలను) ఇప్పుడు తెరపైకి తెచ్చి రమేష్‌పై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపేందుకు అత్తగారు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక ఆసుపత్రి నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చే కుట్ర దాగి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డెడ్‌బాడీ ఎక్కడుందో ఇప్పటికీ సమాచారం లేదు:

ఆసుపత్రి వద్ద ఉన్న మృతదేహాన్ని పోలీసులు వేరే అంబులెన్స్‌లోకి ఎక్కించి ఎటో తీసుకెళ్లారని, ఇప్పటివరకు ఆ డెడ్‌బాడీ ఎక్కడుందో బాధిత కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

అసలు దోషులను వదిలేసి.. బాధితుడిపైనే ప్రతాపమా?

డెలివరీ కోసం వస్తే ఐదున్నర గంటల పాటు ఉంచి, మహిళ మృతికి కారణమైన డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం.. పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్తను అదుపులోకి తీసుకోవడం పట్ల ప్రజాసంఘాలు, గ్రామస్థులు భగ్గుమంటున్నారు. మరణానికి బాధ్యులైన వైద్య బృందంపై సమగ్ర విచారణ జరపకుండా, ఈ కేసును దారిమళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి.

మృతుల కుటుంబాలకు 10 వేలు ఆర్థిక సహాయం

రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్

నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ఒక్కోకుటుంబానికి 5000 చొప్పున రెండు కుటుంబాలకు10,000 ఆర్థిక సాయం అందజేత,కడ్తాల్ మండల కేంద్రంలోని ప్రజలకు ఏకష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుండే కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,లంబాడిహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తన మానవత్వాన్ని చాటుకున్నారు.మండలంలో మరణించిన నిరుపేద కుటుంబాలకు ఆయన తక్షణమే స్పందించి కొండంత భరోసానిచ్చారు.

న్యామంతపూర్ గ్రామ పంచాయతీకి చెందిన ఓర్సు సరస్వతి తుక్కుగూడ సమీపంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా, రావిచేడు

గ్రామానికి చెందిన అండే కార్ రామోజీ రాత్రి అనారోగ్యంతో మరణించారు. జర్పుల దశరథ్ నాయక్ .ఎలాంటి ఆలస్యం చేయకుండా,తన కార్యక్రమాలన్నింటినీ పక్కన బెట్టి నేరుగా బాధితకుటుంబాల వద్ద కు చేరుకున్నారు

పుట్టెడు దుఃఖంలో ఉన్న మృతుల కుటుంబ సభ్యులను దశరథ్ నాయక్ ఓదార్చిన తీరు స్థానికులను కదిలించింది.మృతులపార్థివ దేహాలను సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి ఆయన.. "ఈ కష్ట సమయంలో మీకు నేను తోడుగా ఉంటా, ఎవరూ అధైర్యపడకండి" అంటూ వారి గుండెల్లో ధైర్యాన్ని నింపారు

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ప్రియ రమేష్, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రంగయ్య, వసంత, గ్రామ కమిటీ అధ్యక్షుడురమేష్,నాయకులురామచంద్రయ్య, రవి, మోబిన్, చందు, లింగం, అశోక్, వెంకటేష్, చందు, కృష్ణయ్య తదితరులు పాల్గొని దశరథ్ నాయక్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు ఈ సాయాన్ని అందజేశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

రామన్నపేట, అక్షిత ప్రతినిధి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం, మై భారత్ కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్న మంజుల మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ తొలి ఉప ప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.అకడమిక్ కోఆర్డినేటర్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ డి. కిషన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో బార్డోలి ఉద్యమం విజయవంతం కావడంలో పటేల్ చేసిన కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి కూడా విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత, అధ్యాపకులు డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం. అనిత, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ల శ్రీను, అమర్, నరేష్, రాంబాబు తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి

బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా

ఖమ్మం/అక్షిత బ్యూరో : భారత ఉక్కు మనిషి దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా జిల్లా కలెక్టర్ దివాకర కి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాజేష్ గుప్తా మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ తొలి ఉప ప్రధానమంత్రి హోంమంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ ఐక్యత సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆ మహనీయుని సేవలకు గుర్తింపుగా ఖమ్మం నగరంలోని అనువైన ప్రధాన కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించి ప్రభుత్వ అనుమతులు మంజూరు చేసేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్ర యువతకు భావి భారత పౌరులకు స్ఫూర్తినివ్వాలని ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విగ్రహ ఏర్పాటు దోహదపడుతుందని రాజేష్ గుప్తా ఆశాభావం వ్యక్తం చేశారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

ఎల్‌నినోపై రామన్నపేట మండలంలోని గ్రామాల్లో అవగాహన గ్రామసభలు

రామన్నపేట, అక్షిత ప్రతినిధి: సూరారం, తుర్కపల్లి, బాచుప్పల గ్రామపంచాయతీలలో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన, మండల స్థాయి వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు, వర్షపాతం తగ్గే అవకాశాలు, తాగునీటి ఎద్దడి, వ్యవసాయంపై పడే ప్రభావాల గురించి గ్రామస్తులకు వివరించారు. రానున్న రోజుల్లో నీటి కొరతను అధిగమించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం, గ్రామంలోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను సంరక్షించుకోవడం, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాధన సొసైటీ ఆశ్రమంలో వైద్య శిబిరం

దివ్యాంగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత

రామన్నపేట, అక్షిత ప్రతినిధి: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలోని సాధన సొసైటీ ఫర్ ది మెంటల్లీ హ్యాండిక్యాప్డ్ పర్సన్స్ హోమ్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. సబిత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమంలోని మానసిక దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, వైద్య సంరక్షణపై తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజంలోని దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు న్యాయ సేవలతో పాటు వైద్య, సంక్షేమ సేవలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. దివ్యాంగుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సొసైటీ వ్యవస్థాపకురాలు ఆర్. సురేఖ రెడ్డి, మండల న్యాయ సేవాధికార సంస్థ అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులు కె. శ్రీశైలం, పారా లీగల్ వాలంటీర్ కె.యాదయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జ్యోతి, వలిగొండ ఎస్సై ఏ. శ్రీకాంత్ రెడ్డి, సాధన హోమ్ ఇన్‌చార్జ్ మీనాక్షి, ఆశా కార్యకర్త వి. వసంత, ఏఎన్ఎం కె. ప్రియాంక, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి బలం..

ఐక్యతతోనే అభివృద్ధి

సర్దార్ పటేల్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి

వ్యసనాలు,దురలవాట్లకు దూరంగా ఉండాలి

సూర్యాపేటలో విద్యార్థులు, యువత,పోలీసులతో కలిసి జాతీయ ఐక్యతా పరుగు తీసిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట, అక్షిత బ్యూరో : భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో జాతీయ ఐక్యతా పరుగు ఘనంగా నిర్వహించారు.స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా నుంచి సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించిన ఈ పరుగును జిల్లా ఎస్పీ కె. నరసింహ ప్రారంభించి,విద్యార్థులు, యువత,పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం సద్దుల చెరువు వద్ద సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.దేశ ఐక్యత,సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. భారతదేశానికి యువతే అతిపెద్ద బలమని,యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి సాధించాలని, తాత్కాలిక ఆనందాల కోసం విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. 1947కు ముందు భారతదేశం అనేక చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలుగా విభజించబడి ఉండేదని,వాటన్నింటినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారతదేశ నిర్మాణంలో పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలోనూ ఆయన గొప్ప పాత్ర పోషించారని గుర్తు చేశారు.దేశ సమగ్రత,ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,ఆయన జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని అభిప్రాయ పడ్డారు.అంతేగాక యువత వ్యసనాలు,దురలవాట్లు, నేరాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు.వ్యక్తిగత అభివృద్ధి నుంచే దేశాభివృద్ధి ప్రారంభమవుతుందని, సమాజం,దేశం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్,నరసింహా చారి, పోలీసు అధికారులు,సిబ్బంది, పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణంపై జిల్లా వైద్యాధికారిణి ఆకస్మిక తనిఖీ

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కేసు వివరాలు, వైద్యుల విధులపై విచారణ.. కలెక్టర్‌కు నివేదిక

షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: షాద్‌నగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి, కడుపులోని శిశువు మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఈ ఘటనపై రంగారెడ్డి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ అనురాగిణి రెడ్డి శనివారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి సకాలంలో వైద్యం అందలేదన్న కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా సంబంధిత కేసు పత్రాలు, వైద్య చికిత్స వివరాలు, విధుల పట్టికలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, మత్తుమందుల వైద్యురాలు డాక్టర్ స్వాతితో పాటు ఇతర వైద్యులు, విధుల్లో ఉన్న సిబ్బందిని విడివిడిగా విచారించి వివరణలు సేకరించారు. గర్భిణి ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి అందించిన వైద్యం, ఆమె ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసిన విధానం, మెరుగైన వైద్యం కోసం తరలించడంలో జరిగిన పరిణామాలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని డీసీహెచ్‌ఎస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమయపాలన పాటించకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని, విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తల్లీబిడ్డల ప్రాణాలకు సంబంధించిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ స్వాతి, ఇతర వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

వరంగల్ ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం

రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ , ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్

కాజిపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ , ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ , మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి సమావేశము ఏర్పాటు చేశారు. హన్మకొండలోని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని నాయకులు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని, ప్రతి ఒక్కరికీ ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ఆకాంక్షలకు ప్రాధాన్యత కల్పించాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు.

వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న పట్టభద్రులు, ఉద్యోగులు, యువతకు ఓటరు నమోదు కార్యక్రమంపై సమాచారం అందించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు.

పట్టభద్రుల హక్కుల పరిరక్షణకు, వారి గొంతుకను శాసనమండలిలో వినిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.